సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్–నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్విక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

నయా 'రియల్' దందా!

మెట్‌పల్లిలో రియల్టర్ల ఇష్టారాజ్యం

- లే అవుట్ లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ వెంచర్లు
- గుంటలలో రిజిస్ట్రేషన్, ఆ వెంటనే కన్వర్షన్
- ప్రభుత్వ ఆదాయానికి, మున్సిపల్ ఆస్తికి గండి
- పట్టని టౌన్ ప్లానింగ్ యంత్రాగం

మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఆరపేట శివారులో అక్రమ లే అవుట్‌లో హద్దురాళ్ల తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

మెట్‌పల్లి, ఫిబ్రవరి 11: వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించాలంటే నిబంధనల ప్రకారం లే అవుట్ వేసి అనుమతి పొందాలి. అందుకు ముందుగా వ్యవసాయ భూమికి మార్కెట్ విలువలో 3 శాతం నాలా పన్ను చెల్లించాలి. భూమి విస్తీర్ణంలో 10 శాతం భూమిని కమ్యూనిటీ అవసరాల కోసం మున్సిపల్‌కు రిజిస్ట్రేషన్ చేసి స్వాధీనం చేయాలి. పైగా ప్రధాన రహదారిని 40 అడుగులు, అంతర్గత రహదారులను 30 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేయాలి. అలాగే డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. వ్యవసాయ భూమికి (గుంటలు)సంబంధించి రిజిస్ట్రేషన్లను తహసీల్ కార్యాలయంలో, వ్యవసాయేతర భూమి (చదరపు గజాలు)అయితే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేయాల్సి ఉంటుంది. అయితే చదరపు గజాలలో రిజిస్ట్రేషన్ చేయాలంటే లే అవుట్‌కు అనుమతి ఉండాలి. అయితే అవేమీ పట్టకుండా పలువురు రియల్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న పట్టణీకరణలో భాగంగా మెట్‌పల్లి పట్టణ శివారుకు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూములను చదును చేయడం, 18, 21, 24 అడుగుల వెడల్పుతో అంతర్గత రహదారులు వేసి ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరుపుతున్నారు. అక్కడే తమ అతి తెలివిని ప్రదర్శిస్తున్నారు. కొనుగోలుదారుకు చదరపు గజముల విస్తీర్ణంతో ప్లాట్‌ను విక్రయించడం, రిజిస్ట్రేషన్‌కు వచ్చేసరికి తహసీల్ కార్యాలయంలో గుంటల పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయిస్తారు. ఆ వెంటనే లేదా ఒకటి, రెండు రోజుల తర్వాత అదే ప్లాట్‌ను వ్యవసాయేతర భూమిగా నాలా పన్ను చెల్లించి వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవడం పరిపాటిగా మారింది. వ్యవసాయ భూమిలో అక్రమ లే అవుట్లతో ఒక వైపు ప్రభుత్వ ఆదాయానికి, మరో వైపు కమ్యూనిటీ అవసరాల కోసం మున్సిపల్‌కు అప్పగించాల్సిన 10 శాతం భూమికి ఎగనామం పెడుతున్నారు.

అధికారుల చోద్యం

మేజర్ పంచాయతీ నుంచి 2004లో మున్సిపాలిటీగా అవతరించిన మెట్‌పల్లి పట్టణంలో రోజు రోజుకూ జనవాసాలతో విస్తరిస్తున్నది. లే అవుట్ లేకపోవడంతో ఇరుకైన రహదారులు, మౌలిక వసతులు లేమితో పలు కాలనీల ప్రజలు సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటి వరకు పట్టణంలో కేవలం నాలుగు చోట్ల వెంచర్లకు మాత్రమే లే అవుట్ అనుమతి ఉన్నట్లు సమాచారం. ఎక్కడ పడితే అక్కడ పట్టణ శివారుల్లో నిబంధనలు తుంగలో తొక్కుతూ రియల్టర్లు అక్రమ లే అవుట్లతో ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇబ్బడి ముబ్బడిగా కడుతున్న ఇండ్ల నిర్మాణాలతో ఇరుకైన అంతర్గత రహదారులపై వచ్చిపోయే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీస మౌలిక వసతులను నోచుకోని పరిస్థితి ఏర్పడుతున్నది. విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లతో వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికార విభాగం పట్టించుకోవడం లేదు. రాజకీయ ఒత్తిళ్లా..? మామూళ్లు ముట్టడమా..? తెలియదు కాని అక్రమ వెంచర్లపై కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా ప్రత్యేకించి ఫిర్యాదు చేస్తే గాని స్పందించరు.

> మెట్‌పల్లిలో రియల్ దందా జోరుగా సాగుతున్నది. అక్రమ లే అవుట్లకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. నిబంధనల్లోని లొసుగులను అదనుగా చేసుకుని రియల్టర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ లే అవుట్లు వేస్తూ ప్లాట్లను విక్రయిస్తూ అటు ప్రభుత్వానికి, ఇటు మున్సిపల్ ఆదాయానికి గండికొడుతుండగా, పట్టని టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.

అనుమతికి వెళితే తడిసిమోపెడు..

అక్రమ లే అవుట్లలో ప్లాట్ కొనుగోలు చేసిన వారికి ఆర్థికంగా తీరని నష్టం జరుగుతుంది. కొనుగోలు చేసిన ప్లాట్‌ను (గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసినట్లయితే) మార్కెట్ విలువలో 3 శాతం నాలా పన్ను కట్టి వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయించుకోవాలి. ఆ తర్వాత ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్‌కు అనుమతి కోసం వెళితే ఎల్ఆర్ఎస్ (స్థల క్రమ బద్ధీకరణ)కోసం దరఖాస్తు ఫీజు చెల్లించాలి. అలాగే నిర్ణీత రుసుం, మార్కెట్ విలువలో 14 శాతం ఫీజు చెల్లించాలి. అలాగే రోడ్డు ఎఫెక్ట్, సెట్‌బ్యాక్‌కు స్థలం వదులుకోవాలి. అప్పుడే ఇంటి నిర్మాణానికి అనుమతి పొందాల్సి ఉంటుంది. అక్రమ లే అవుట్లలో ప్లాట్ కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణం కోసం అనుమతికి వెళ్లినప్పుడు ఇలా ఆర్థిక భారం తడిసి మోపెడవడమే కాకుండా రోడ్డు ఎఫెక్ట్, సెట్ బ్యాక్ పేరిట తన ప్లాట్ స్థలం నుంచి ఖరీదైన స్థలం విడిచిపెట్టక తప్పదు. అక్రమ వెంచర్లలో ప్లాట్లు విక్రయించి రియల్టర్లు సొమ్ము చేసుకుంటుండగా, అందులో కొనుగోలు చేసిన లేఅవుట్‌పై అవగాహన లేని అనేక మంది భవిష్యత్‌లో ఇంటి నిర్మాణం అనుమతికి నిర్దేశిత నిబంధనలతో భారీగా నష్టపోవాల్సి వస్తుంది.

ప్లానింగ్ విభాగంలో పోస్టులన్నీ ఖాళీ

అక్రమ లే అవుట్లతో కొనసాగుతున్న ప్లాట్ల విక్రయాలు, అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం పలు పోస్టుల ఖాళీతో వెలవెలబోతున్నది. పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ, చర్యలు తీసుకోవడంలో లోపం కనిపిస్తున్నది. మెట్‌పల్లి టౌన్‌ప్లానింగ్ విభాగంలో ముగ్గురు టీపీబీఓలు, ఇద్దరు టీపీఎస్‌లు ఉండాల్సి ఉండగా రెండు రోజుల క్రితం ఒకటి టీపీఎస్ పోస్టు భర్తీ అయినది. ఒక టీపీఓ పోస్టు ఉండగా, అది కూడా పూర్తి స్థాయి అధికారిలేరు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన టీపీఓను ఇక్కడికి డిప్యూటేషన్ మీద బదిలీ చేశారు. ఆ అధికారి వారానికి మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహిస్తుంటారు. ఆ అధికారి వచ్చినప్పుడే టౌన్ ప్లానింగ్ విభాగంలో పైళ్లకు చలనం వస్తుంది, క్షేత్ర స్థాయిలో పరిశీలన జరుగుతుంది. అక్రమ లే అవుట్లను, అక్రమ కట్టడాల నిరోధానికి టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల మూడు లే అవుట్లలో వేసిన ప్లాట్ల హద్దురాళ్లను తొలగించడం జరిగింది. లే అవుట్ లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్‌కు అనుమతించవద్దని సబ్‌రిజిస్ట్రార్‌కు కూడా మున్సిపల్ నుంచి లేఖ పంపించాం. ఎక్కడైనా అనుమతిలేకుండా ప్లాట్లు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు చేపడతాం.

- మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

పత్తి రైతుల కన్నెర్ర

- కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కొత్తపేటలో ధర్నా

ఎండపల్లి మండలం కొత్తపేటలో ధర్నా చేస్తున్న పత్తి రైతులు

వెల్గటూర్, ఫిబ్రవరి 11: పత్తి రైతులు కన్నెర్రజేశారు. సెంటర్‌కు పత్తి తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలులో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటలో రాష్ట్ర రహదారిపై ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ఎండపల్లి మండలం కొత్తపేటలో శాతవాహన జిన్నింగ్ మిల్లులో ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. తాము రెండు, మూడు రోజుల కిందనే కేంద్రాలకు పత్తి తీసుకువచ్చామని, రోజుకో కారణం చెప్పి అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదని వాపోయారు. రైతు సాగు చేసిన పంటల వివరాలు ఆన్‌లైన్‌లో ఆధార్‌తో సరితూగడం లేదని రెండ్రోజుల కింద కొనుగోళ్లు నిలిపివేశారని, మంగళవారం సిగ్నల్ కూడా రావడం లేదని కొనుగోలు చేయలేదని, ఇలా అయితే ఎలా..? అని ఎన్నిరోజులు పడిగాపులు పడమంటారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో దాదాపు 40 వరకు వాహనాలు నిలిచిపోయాయని, వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ధర్నాతో ఇరువైపులా కిలో మీటర్ పొడవునా వాహనాలు నిలిచిపోగా, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు. ఆందోన వద్దని, సర్వర్ సమస్య దేశవ్యాప్తంగా ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని, ఆ వెంటనే కొనుగోలు చేస్తారని ఎండపల్లి తహసీల్దార్ రవికాంత్, ఎస్ఐ ఉమాసాగర్, సీపీఓ గజేంద్ర తైవాడే రైతులకు సర్దిచెప్పారు.

రెండ్రోజులుగా పడికాపులు కాస్తున్న..

మిల్లుకు నాలుగు రోజుల కింద వచ్చి పత్తి ఎన్నడు తీసుకురమ్మంటరని అడిగిన. సోమవారం రమ్మని అంటేనే అదే రోజు ఉదయం 5 గంటలకు ట్రాక్టర్‌లో తీసుకువచ్చిన. సర్వర్ పని చేస్తలేదని తిప్పి పంపిన్రు. మంగళవారం వస్తే ఇయ్యాల లైన్లు వస్తాలేవంటున్నరు. నేను ఏం చేయాలె. ఎటు పోవాలె. ఉన్న పైసలన్నీ ట్రాక్టర్ కిరాయిలకే అయితున్నయి.

- కొండపల్లి రాజమల్లు, పత్తి రైతు, పైడిపల్లి

మా రైతులంటే అందరికీ అలుసే..

నేను మిల్లుకు వచ్చి రెండు రోజులైతుంది. ఇంకో రోజు గడిస్తే అటూ ఇటూ తిరగలేక రైతులకే బాధనిపించి ప్రైవేటులో తక్కువకు అమ్ముతరని కావాలనే లైన్ లేదని చెబుతున్నట్టు అనిపిస్తుంది. సర్కార్‌కు అమ్మితే రూ.7400 వస్తయి. ప్రైవేటులో అమ్మితే రూ.6వేలే. ఏడాది కష్టపడి పండిస్తే అమ్మేటప్పుడు ఇన్ని కష్టాలా..?. మా రైతులంటే అందరికీ అలుసే.

- తనుగుల శంకరమ్మ, మారేడుపల్లి, ఎండపల్లి మండలం.

మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 11: జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షు